# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 30, డిసెంబరు, 2014

రాష్ట్రంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని జరిపిన నిర్మాణాలను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. అసెంబ్లీలో చేసిన తీర్మానం, అఖిలపక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా నిరుపేదల పట్ల అత్యంత సానుభూతితో ఉండే విధంగా క్రమబద్ధీకరణ నిబంధనలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

క్రమబద్ధీకరణ జిఓ లో పొందుపర్చాల్సిన మార్గదర్శకాల రూపకల్పన కోసం సచివాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, పార్లమెంటరీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, రెవిన్యూ కార్యదర్శి మీనా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్, సిసిఎల్ఏ స్పెషల్ కమీషనర్ జిడి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి అడ్డుకట్ట వేయటం, ప్రతి భూమికి టైటిల్ కలిగియుండటం లాంటి లక్ష్యాలు సాధించడమే క్రమబద్ధీకరణ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. నిరుపేదలు వివిధ జిల్లాల నుండి హైదరాబాద్‌కు వచ్చి తలదాచుకోవడానికి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు, షెడ్లు, ఇండ్లు నిర్మించుకున్నారని, ఆయినా వాటికి పట్టాలు లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నారన్నారు. అలాంటి పేదలకు ఉచితంగానే భూమిని రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరచాల్సిన మార్గదర్శకాలను ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు.

★ 125 గజాల లోపు స్థలంలో నివాసం ఏర్పరుచుకున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ఉచితంగానే రెగ్యులరైజ్ చేయాలి.

★ పట్టణ ప్రాంతాల్లో ఆదాయ పరిమితిని రెండు లక్షలకు పెంచినందున, ఆ లోపు ఆదాయం ఉన్న వారిని పేదలుగానే గుర్తించాలి.

★ 250 గజాల వరకు స్థలంలో నివాసం ఏర్పరుచుకున్న వారికి రిజిస్ట్రేషన్ ధరలో 50 శాతం తీసుకుని రెగ్యులరైజ్ చేయాలి.

★ 500 గజాల వరకు స్థలంలో నివాసం ఏర్పరుచుకున్న వారికి రిజిస్ట్రేషన్ ధరలో 75 శాతం తీసుకుని రెగ్యులరైజ్ చేయాలి.

★ 500 గజాలకు పైన ఉన్న స్థలంలో నివాసం ఏర్పరుచుకున్న వారు 100 శాతం రిజిస్ట్రేషన్ ధర చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలి.

★ వ్యాపార అవసరాల కోసం వాడుకునే స్థలం పరిమాణంతో సంబంధం లేకుండా మొత్తం రిజిస్ట్రేషన్ ధర చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలి. ఆసుపత్రులు, విద్యాసంస్థల లాంటి వాటిని కూడా వ్యాపార సంస్థలుగానే గుర్తించాలి.

★ జూన్ 2, 2014 లోపు నివాసం ఉన్న వారికి మాత్రమే రెగ్యులరైజేషన్ అవకాశం కల్పించాలి. ఆ లోపు సంబంధిత ప్రాంతంలో తాము నివాసం ఉంటున్నట్లు ఆధారం చూపాలి. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడి కార్డు లాంటివి ఏవైనా దరఖాస్తుతో పాటు జతపరచాలి.

★ రెగ్యులరైజేషన్ కోసం ధరఖాస్తు చేయడానికి 20 రోజుల గడువు ఇవ్వాలి. దరఖాస్తు దారుడు తమ దరఖాస్తు తో పాటు నిర్ణయించిన ధరలో 25 శాతం డబ్బులను డిడి రూపంలో సమర్పించాలి.

★ జెసి, ఆర్‌డిఓల పర్యవేక్షణలో దరఖాస్తుల పరిశీలన, ఫిర్యాదుల పై విచారణ, తదితర కార్యక్రమాలు జరగాలి. 90 రోజుల్లోగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ పూర్తి కావాలి.

★ ఏలాంటి నిర్మాణాలు లేకుండా ఖాళీగా వున్న భూములను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని వేలం నిర్వహించాలి.

★ రెగ్యులరైజ్ చేసిన తరువాత మహిళల పేరు మీదనే పట్టాలు ఇవ్వాలి. అధికారులు విచారణ జరిపే సందర్భంగా ఏ ప్రాంతంలో, ఎంత స్థలంలో, ఏ ఇంట్లో నివాసం ఉంటున్నారో గుర్తించి ఫోటోలు కూడా తీసుకోవాలి.

★ రెగ్యులరైజేషన్ ప్రక్రియలో సహకరించడానికి రిటైర్డు రెవిన్యు అధికారుల సేవలను వినియోగించుకోవాలి.

భూముల రెగ్యులరైజేషన్ తో పాటు వివిధ జిల్లాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వేలానికి సంబంధించి కూడా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. చాలా జిల్లాల్లో చిన్న చిన్న బిట్ల రూపంలో ముక్కలు ముక్కలుగా ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వం వాటిని ఏ అవసరాలకు వినియోగించలేకపోతున్నది. దీనివల్ల ఆ భూమి కబ్జాకు గురవుతున్నది. దీనిని నివారించడానికి సదరు బిట్లను వేలం వేయాలని ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. జిల్లా కలెక్టర్లు ప్రతిపాదించిన అలాంటి బిట్లను వేలం వేయడానికి ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారు.

హైదరాబాద్ నగరంలో నాలాల నిర్వహణ సరిగా లేదని, నాలాలు ఆక్రమణకు గురయ్యాయని ముఖ్యమంత్రి అన్నారు. వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడానికి ఇదే కారణమని చెప్పారు. నాలాలపై ఆక్రమణలు తొలగించే విషయంలో, వాటిని సక్రమంగా నిర్వహించే విషయంలో అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం